క్లుప్తంగా

గజపతినగరం ఎస్ఐగా కిరణ్‌కుమార్‌నాయుడు



గజపతినగరం: మండల ఎస్ఐగా కిల్లారి కిరణ్‌కుమార్‌నాయుడు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు.ఈయన విజయనగరం నుంచి బదిలీపై ఇక్క డికి వచ్చారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ కె.లక్ష్మణరావు వీఆర్‌కు విజయనగరం బదిలీ అయ్యారు.

ధ్యానం, యోగాపై అవగాహన



విద్యార్థులతో ధ్యానం చేయిస్తున్న రామకృష్ణరాజు

బొండపల్లి: వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ రోజూ క్రమం తప్పకుండా ధ్యానం, యోగా చేయడం ద్వారా ఆరో గ్యంగా ఉండవచ్చని పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు అన్నారు. బి.రాజేరు గ్రామంలో విద్యార్థులకు ధ్యానం, యోగాపై గురువారం అవగాహన కల్పించారు. ధ్యానం చేసే విధానం వివరించడంతో పాటు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. పిరమిడ్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ వద్ద 'రాయబారి' కార్యక్రమం

వేపాడ: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30వ తేదీన జిల్లా కేంద్రం విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద 'రాయబారి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు వెంకన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వీఆర్‌ఏల సమస్యల ను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి పదినెలలు గడిచినప్ప టికీ వీఆర్‌ఏల సమస్యలపై దృష్టి సారించ లేదని, నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీలు వేస్తున్నారని ఆరోపించారు. టీఏ, డీఏలు ఇవ్వడం లేదని, ఎనిమిదేళ్లుగా జీతాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశా రు. సీనియర్ వీఆర్‌ఏలకు వీఆర్‌ఓలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్‌కు నివాళి



సర్పంచ్ దాసు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: పెదమానాపురం గ్రామ సర్పంచ్ గొటివాడ దాసు గుండెపోటుతో బుధవారం మృతి చెందగా గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సందర్శించి నివాళులర్పించా రు. మృతుడి కుమారుడు వినోద్, కుటుంబ సభ్యులను అప్పలనరసయ్య ఓదార్చారు. సర్పంచ్ దాస్‌కు నివాళి అర్పించిన వారిలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, పలు గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

అభినందన



విద్యార్థిని వైష్ణవిని అభినందిస్తున్న డివైన్ సేవియర్ స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది

బొండపల్లి: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో స్థానిక డివైన్ సేవియర్ స్కూల్ విద్యార్థిని వి.వైష్ణవి 584 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. విద్యార్థినిని ఆపాఠశాల యాజమాన్యంతో పాటు ప్రిన్సిపాల్ శాంతి సిస్టర్ గురువారం అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మండలంలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల అన్నింటికీ విద్యార్థిని వైష్ణవి టాపర్‌గా నిలిచిందని చెప్పారు. అలాగే విద్యార్థిని తల్లిదండ్రులు కిషోర్, లతను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

50శాతం రాయితీపై సమీకృత దాణా

లక్కవరపుకోట: పాడి రైతులకు 50 శాతం రాయితీపై సమీకృత దాణా అందజేయనున్నామని మండల పశువైద్యాధికారి కోరాడ గాయత్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పశుదాణా కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలుపు రేషన్ కార్డు ఉన్న, భారత్ పశుధన్ యాప్‌లో పేరు నమోదై, పశువులకు టీకాలు వేయించిన పాడి రైతులే అర్హులని పేర్కొన్నారు.రూ రూ.1,110 విలువగల 50 కిలోల దాణా బ్యాగ్‌ను అర్హులకు రాయితీపై రూ.555కు అందిస్తామని తెలిపారు. రైతులు దరఖాస్తు చేసుకునే సమయంలోనే రుసుం చెల్లించాలని, ఒక రైతుకి ఒక బ్యాగ్ మాత్రమే ఇస్తామని పేర్కొన్నారు.మండలానికి 15 టన్నుల దాణాని ప్రభుత్వం కేటాయించిందని స్పష్టం చేశారు.

శంకుస్థాపనతో సరిపెట్టారు...!

- పెంటశ్రీరాంపురంలో సీసీరోడ్డు, కాలువ నిర్మాణానికి 2024 అక్టోబర్ 18న శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాస్
- ఇంతవరకు పనులు ప్రారంభించని వైనం
- వచ్చే నెల 12న గ్రామదేవత పండగ
- రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



సీసీ రోడ్డు నిర్మాణానికి అక్టోబర్ 18న మంత్రి శ్రీనివాస్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం



సీసీ రోడ్డు వేయాల్సిన ప్రాంతం

గంట్యాడ: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు ఆరంభ శూరత్వంగా తయారయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. ఏదైనా పని ప్రారంభిస్తే హడావుడి చేయడం ఆ తర్వాత జాప్యం చేయడం కూటమి నేతలకు పరిపాటిగా మారింద ని ప్రజలు అను కుంటు న్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెంటశ్రీరాంపురం(పి.ఎస్.ఆర్.పురం) గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ నుంచి రంధి జగన్నాథం ఇంటివరకు ఉపాధి హామీ నిధులు రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మాణానికి 2024 అక్టోబర్ 18వ తేదీన రాష్ట్ర చిన్న, మధ్య తరహా, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. అలాగే పెంట శ్రీరాంపురం నుం చి వసంత గ్రామ రహదారికి రూ. 2 కోట్లతో ఎప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు కూడా శంకుస్థాపన చేసి ఆరు నెలలు దాటిపోతోంది. ఆ పనులు సైతం ఇంకా ప్రారంభం కాలేదు.

కూటమి నేతకు కాంట్రాక్టు

ఉపాధి హామీ నిధులతో మంజూరయ్యే అభివృద్ధి పనులను పంచాయతీ తీర్మానంతో సర్పంచ్ ఆధ్వర్యంలో చేయాల్సి ఉంటుంది. కానీ కూట మి ప్రభుత్వం సర్పంచ్‌లను కాదని వెండర్ విధానం తీసుకువచ్చి పనులను కూటమి నేతలకు కట్టబెడుతోంది.పెంట శ్రీరాంపురంలో కూడా సీసీ రోడ్డు,కాలువ నిర్మాణాన్ని స్థానిక సర్పంచ్‌కు కాకుండా కూటమి నేతకు అప్పగించారు. సదరు నేత మంత్రికి బాగా కావాల్సిన వాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి.' పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం సంక్రాంతిలోగా పూర్తి చేయిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అప్పట్లో ప్రకటించారు. అయితే సంక్రాంతి పండగ తర్వాత శివరాత్రి, ఉగాది పండగలు వెళ్లిపోయినప్పటికీ పెంట శ్రీరాంపురంలో మాత్రం రోడ్డు నిర్మాణం జరగలేదు.

గ్రామదేవత పండగ నాటికైనా పూర్తయ్యేనా..?

వచ్చే 12, 13, 14వ తేదీల్లో పెంట శ్రీరాంపురం గ్రామంలో పైడితల్లమ్మ పండగ నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిర్ణయించారు. పండగలోగా సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే పండగ నిర్వాహణకు అనువుగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. ఇంకా గ్రామ దేవత పండగకు 18 రోజుల వ్యవధే ఉంది. రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండగలోగా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నా మంత్రి, కూటమి నేతలు ఇప్పటి వరకు పనులు చేయకపోవడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని పంచాయతీరాజ్ జేఈ కృష్ణమూర్తి వద్ద సాక్షి ప్రస్తావించగా కాలువపై శ్లాబుల నిర్మాణం పూర్తయ్యిందని, సీసీ రోడ్డు నిర్మాణం ఇంకా ప్రారంభించ లేదని చెప్పారు.

ఉత్తమ పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, తదితరులు

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెం,పాటూరు పంచాయతీల కార్యదర్శుల ఆర్.కిశోర్, జి.అనిల్‌కుమార్ ఉత్తమ పంచాయతీ కార్యదర్శులుగా ఎంపిక య్యారు.పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ, పలుశాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది గురువారం సన్మానించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. వెలుగు, ఉపాధి హామీ అధికారులు, పంచాయతీరాజ్ ఏఈ, ఈఓపీఆర్డీ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న జైహింద్‌కుమార్

గంట్యాడ:రామవరం సచివాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సచివాలయ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్ దుస్తులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషుబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించే ఈసమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

శృంగవరపుకోట: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అధికారులను ఆదేశించారు.మండలంలోని కొట్టాం, మామిడిపల్లి గ్రామ సచివాలయాలను ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజుతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. గ్రామసచివాలయాల్లో అర్జీలు, రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కొట్టాంలో కల్యాణ మండపానికి ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరారు. మామిడిపల్లిలో పలు సమస్యలను సర్పంచ్ మంగమ్మ ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ ఆయాశాఖల అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఉపాధి పనులను పరిశీలించి, వేతనదారుల సమస్యలను తెలుసుకున్నారు. తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్డీ లక్ష్మి పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల సేవలను వినియోగించుకోండి



ర్యాలీ చేస్తున్న జిల్లా అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది

గజపతినగరం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) సేవలను రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగించుకోవాలని జిల్లా సహకార అధికారి పి.రమేష్ సూచించారు. మండల కేంద్రంలో స్థానిక పీఏసీఎస్ సిబ్బందితో పాటు సబ్ డివిజన్ పరిధిలోని ఏడు పీఏసీఎస్‌ల ప్రతినిధులతో కలిసి పీఏసీఎస్‌ల సేవలపై అవగాహన గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సహకారి అధికారి రమేష్ మాట్లాడుతూ పీఏఈఎస్‌ల ద్వారా రైతులకు రుణాలు అందించ డంతో పాటు మొక్కజొన్న,ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. పీఏసీఎస్‌లను ఈపీసీఎస్ లుగా మార్పు చేసి సీఎస్సీ సేవలను అందించనున్నామని పేర్కొన్నారు. విజయనగరం డివిజినల్ సహకార అధికారి రామ్మూర్తి, గజపతినగరం సబ్‌డివిజినల్ సహకార అధికారి ఎం.వానిశైలజ, స్థానిక సీఈఓ నారాయణరావు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి



ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్ర త్తలు తీసుకోవాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎల్.సత్యారావు సూచించారు. మండలంలోని ఉత్తరాపల్లి గ్రామ సమీపంలోని చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు గురువారం అవగాహన కల్పించారు.సత్యారావు మాట్లాడుతూ వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు మజ్జిగ, నిమ్మరసం, బార్లీ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు.ఎండలో పనిచేసే సమయంలో చెప్పులు, తలపాగా ధరించాలని సూచించారు. మద్యం పొగాకు, ఖైనీ వంటి పదార్థాలు తీసుకోకూడదని, ఆయిల్ ఫుడ్, బిర్యానీ, మాంసాహార పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు.పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లతో పాటు ప్రాథమిక చికిత్స కిట్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, వైద్య సిబ్బంది పద్మావతి, ఈశ్వరరావు, తులసి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

15 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యం

- అందుబాటులో ఉన్న భూమిని పూర్తిస్థాయిలో సాగులోకి తేవాలి
- గ్రామస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
- స్వర్ణాంధ్ర -2047 విజన్ ప్లాన్‌పై అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్



అవగాహన కార్యక్రమానికి హాజరైన గజపతినగరం నియోజకవర్గంలోని ప్రభుత్వ అధికారులు

గజపతినగరం: వ్యవసాయ అనుబంధ రంగాల్లో రానున్న నాలుగేళ్లలో జిల్లాలో 15 శాతం వృద్ధి రేటు సాధించడమే లక్ష్యంగా అంతా పనిచేయాలని, అందుకు అనుగుణంగా గ్రామస్థాయిలో ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్లాన్‌పై నియోజకవర్గస్థాయి అవగాహన కార్యక్రమాన్ని గజపతి నగరంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రణాళికలను రూపొందించడమే కాకుండా వాటిని చిత్తశుద్ధితో అమలు చేయాలని అన్నారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగంలోనే ఎక్కు వ అభివృద్ధి సాధించే అవకాశం ఉందని, ఆదిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని అన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూముల న్నింటినీ దశల వారీగా సాగులోకి తీసుకు రావాలని, ఉద్యానవన,వాణిజ్య పంటల సాగును విస్తరించాలని, ఉత్పత్తి, ఉత్పాదకత,నాణ్యతను పెంచడంపై దృష్టి సారించాలని సూచించారు. పాలు, మాంసం ఉత్పత్తిలో జిల్లా స్వయం సమృద్ధిని సాధించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వృథాగా ఉన్న చెరువుల్లో చేపల పెంపకం చేపట్టాలని, సేవా రంగంలోనూ జిల్లాను అభి వృద్ధి పథంలో నడిపించాలని అన్నారు.భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే సేవారంగంలోనూ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. విజన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేసి, జిల్లాను ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుపుదామని అన్నారు. అనంతరం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ స్వర్ణాంధ్ర -2047 విజన్ ప్లాన్ లక్ష్యాలు, వాటిని సాధించేందుకు అవలంబించా ల్సిన మార్గాలను వివరించారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు సన్మానం

గజపతినగరం నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతులను కలెక్టర్ అంబేడ్కర్ సన్మానించి, వారికి నవధాన్యాల విత్తన కిట్లను అందజేశారు. వ్యవసాయశాఖ జేడీ వి. టి.రామారావు, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.వి.రమణ, ఉద్యానవనశాఖ డీడీ ఏ.వి.ఎస్.వి జమదగ్ని, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, మత్స్యశాఖ ఇన్‌చార్జ్ డీడీ విజయకృష్ణ, నియో జకవర్గ ప్రత్యేకాధికారి ప్రమీళా గాంధీ, ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఆనందరావు, నాలుగు మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నా రు.

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై మంగళవారం ఉగ్రవాదులు జరిపిన దాడిని ఏపీ దళిత కూలీ రైతు సంఘం, మండల మాలమహానాడు నేతలు తీవ్రంగా ఖండించారు. గురువారం రాత్రి వేపాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళి అర్పించారు. అనంతరం ర్యాలీ చేశారు.మాలమహానాడు మండల అధ్యక్షుడు దేబార్కి కిరణ్, నాయకులు వంటాకు భాస్కర్, దేముళ్లు, బోర అప్పారావు, శ్రీను,గంగరాజు, తదితరులు పాల్గొన్నారు. – వేపాడ

విజయోత్సవ ర్యాలీ



గజపతినగరంలోని పురిటిపెంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చిప్పాడ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు గురువారం సాయంత్రం గజపతినగ రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధికంగా తమ పాఠశాలలోని 26 మంది విద్యార్థినులు 500కు పైబడి మార్కులు సాధించారని చెప్పారు. పాఠశాలలో అన్ని సదుపాయాలతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ర్యాలీలో జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి కె.మోహన్‌రావు, స్కూల్ కమిటీ చైర్మన్ లెంక స్వామినాయుడు పాల్గొన్నారు. – గజపతినగరం

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గుర్ల, గరివిడి, గజప తినగరం, గంట్యాడ జెడ్పీటీసీలు శీర అప్పలనాయుడు, వాకాడ శ్రీనివాసరావు, గార తవుడు, వర్రి నరసింహమూర్తి గురు వారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని రాజకీయ పరిణామాలపై జెడ్పీటీసీలను జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. – గుర్ల

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



శృంగవరపుకోట: ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు



దత్తిరాజేరు: దత్తిరాజేరులో ర్యాలీ చేస్తున్న మండల పరిషత్ ఉద్యోగులు



బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ చలం నాయుడు



గుర్ల: గుర్లలో ర్యాలీ చేస్తున్న ఎంపీపీ పొట్నూరు ప్రమీల, మండల పరిషత్ ఉద్యోగులు

పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఎస్.కోట, దత్తిరాజేరు, బొండపల్లి, గుర్ల మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్.కోటలో నిర్వహించిన వేడుకలకు అతిథిగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు. ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్డీ బి.లక్ష్మి, పంచా యతీరాజ్‌లో వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజుతో కలిసి ఎమ్మెల్సీ రఘురాజు సత్కరించారు. దత్తిరాజే రులో మండల పరిషత్ ఉద్యోగులు ర్యాలీ చేశారు. బొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలం నాయుడు, ఎంపీడీఓ కె.తులసీనాథ్, ఈఓపీఆర్డీ ఏ.రఘుపతిరావుతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్లలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, మండల పరిషత్ ఏఓ వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఏపీఎం భారతి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు పాల్గొన్నారు.
– శృంగవరపుకోట/దత్తిరాజేరు/ బొండపల్లి/ గుర్ల

వసతిగృహ విద్యార్థినులకు సన్మానం



విద్యార్థినులను సన్మానిస్తున్న విజయనగరం రూరల్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి స్వరూపకుమారి

గజపతినగరం:పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన నియోజకవర్గంలోని బాలికల వసతి గృహాల విద్యార్థినులను స్థానిక బాలికల వసతి గృహంలో విజయనగరం రూరల్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి వి.ఎల్.ఎం.స్వరూప కుమారి గురువారం సన్మా నించారు. బొండపల్లి బాలికల వసతి గృహం విద్యార్థినులు పి.పుష్ప 538 మార్కులు, ఎం.పుష్ప 532 మార్కులు, గజపతినగరం బాలి కల వసతి గృహం విద్యార్థిని ఎస్.శ్రవంతి 525 మార్కులతో ఆయా వసతి గృహాలకు టాపర్లుగా నిలిచారు. వీరిని విజయనగరం రూరల్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి స్వరూప కుమారి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో విజయనగరం రూరల్ పరిధి వసతి గృహాల సంక్షేమ అధికారులు శ్రావణి, ఎం.గౌరి, కె.గౌరీలక్ష్మి, పి.మీనాక్షి, జి.జి.సన్యాసిరావు, ఎస్.అప్పలనాయుడు, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.